విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 23 జూన్ 2024 8 పేజీలు

యువతిపై అత్యాచారం హత్య ఘటనలో

నిందితులు అరెస్టు

విశాలాంధ్ర-చీరాల: శుక్రవారం ఉదయం చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈపురుపాలెం గ్రామంలోని సీతారాం పేట వద్ద జరిగిన యువతిపై లైంగిక దాడి ఆపై హత్య కేసును సవాలుగా తీసుకొని 48 గంటల లోపు జిల్లా పోలీస్ అధికారులు ఛేదించారు. శనివారం సాయంత్రం చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు. హతురాలు సుచరిత ఇంటర్ వరకు చదవుకొని, ఇంటి వద్ద కుట్టు మిషన్ కుట్టుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తుందని శుక్రవారం ఉదయం సుమారు 5.45 గంటల సమయంలో హతురాలు తన ఇంటికి దగ్గరలో ఉన్న రైలు పట్టాల సమీపానికి బహిర్భూమికి వెళ్ళి ఇంటికి తిరిగి రాకపోవటంతో ఆమె కోసం వెతకగా, నేర స్థలంలో హతురాలు మృతి చెందింది. గుర్తు తెలియని వారు హతురాలిని మానభంగం చేసి,చంపి ఉంటారని హతురాలి తల్లి పంజుల కామాక్షి ఇచ్చిన రిపోర్ట్ మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశామన్నారు. కేసు నమోదు చేసుకుని విచారించగాపై నిందితులను పట్టుకొని విచారించగా నేరం చేసారని అంగీకరించారు. నిందితులు మత్తుకు బానిసలై,మద్యం సేవిస్తూ శుక్రవారం ఉదయం రైల్వే ట్రాక్ సమీపంలో బహిర్భూమికి వెళ్లిన యువతిని ఇద్దరు నిందితులు బలవంతంగా చెట్లపొదలలోకి తీసుకు వెళ్ళి ,నోరుమూసి బలవంతంగా అత్యాచారం చేసి అనంతరం ముఖంపై దాడిచేసి నోరు ముక్కు మూసి హత్య చేసారు.వారికీ మరొక అతను సహకరించారని తెలిపారు.

గతంలోనే నిందితుల నేర చరిత్ర

నిందితుడు అయిన దేవరకొండ విజయ్ మీద చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదైందని తెలిపారు. అందులో ఒకటి మర్డర్ కేసు. ఇతని మీద చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ నెంబర్ 63 ఉన్నదని, ముద్దాయి అయిన దేవరకొండ శ్రీకాంత్ మీద చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో పలు కేసులు నమోదు అయి ఉన్నవని, అందులో ఒకటి మర్డర్ కేసు, ఒక హత్యాయత్న కేసు అని తెలిపారు. ఇతని మీద చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ లో రౌడీ షీట్ నెంబర్ 45 ఉన్నదని, వీరిద్దరికీ నిందితుడు కారంకి మహేష్ సహాయకారిగా ఉన్నాడని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువతి అత్యాచార ఆపై హత్య ఘటనను, ఆంధ్ర ప్రదేశ్ డిజిపి, సౌత్ కోస్టల్ జోన్ గుంటూరు రేంజ్ ఐజిపి సవాలుగా తీసుకొని ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు, పది ప్రత్యేక

మిగతా 2 లో ...

చెక్కవారిపాలెం ప్రజల... దాహర్తి కేకలు

- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె నియోజకవర్గం పరిధిలోని కూచినపూడి ప్రజ్ఞనమ్ పంచాయతీ లోని చెక్కవారిపాలెంగ్రామంలో కాపు వర్గం, దళితవాడ ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తూ ఉంటారు. ఏళ్ల తరబడి నేటికీ ఈ గ్రామ ప్రజలకు తాగునీటి వసతి సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతూనే ఉంది. డిజిటల్ యోగంలో కూడా గ్రామీణులకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు . ఏ ప్రభుత్వం వచ్చినా అరి చేతిలో వైకుంఠం చూపిస్తుందని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. పంచాయితీ పరిధిలో ఉన్న మంచినీటి చెరువును ఆధునికరించి కలుషితమైన నీటిని బయటకు తోడి మంచినీటితో నింపి రక్షిత మంచినీటి పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి సదుపాయాల్ని కలుగ చేస్తామని ఎన్నికల ముందు ప్రజా ప్రతినిధులు గ్రామీణ ప్రజలకు ఓట్ల కోసం మాయ మాటలు చెప్పి వారిని మభ్యపెడుతున్నారని గ్రామీణులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామీణ ప్రజల కోరుతున్నారు.చిన్నారులు, పెద్దలు ఈ మంచినీటి బోర్ల వద్దకు వచ్చి బోరు నీటిని బాటిల్ల లోనికి పట్టుకొని శాలలకు, గృహ అవసరాలకు ఈ నీటిని ఉపయోగించవలసిన పరిస్థితి ఎక్కడ నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సుచరిత హంతకులను కఠినంగా శిక్షించాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.బాలాజీ

విశాలాంధ్ర - రేపల్లె : తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్ళిన చీరాల మండలం ఈపురుపాలెం పంచాయతీలోని సీతారంపేటకు చెందిన పముజుల సుచరితపై అత్యాచారం చేసి అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా గంజాయి, డ్రగ్స్, మద్యంపై నియంత్రణ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించిన తీరు హర్షనీయం

ఈపురుపాలెంలో యువతిపై జరిగిన హత్యాచారం, హత్య సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరు హర్షనీయమని బాలాజీ అన్నారు. విషయం తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు స్పందించడంతో పాటు హోంమంత్రి అనితను ఘటన స్థలానికి చేరుకుని 48 గంటలలో నింధితులను గుర్తించి అరెస్ట్ చేయాలని ఆదేశించడం హర్షనీయమన్నారు. ఎ.పి. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యులు కొడాలి రామకోటేశ్వరరావు, జి. లక్ష్మి, కె. వీర మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

‘డయేరియా’ను అరికట్టాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : డయేరియా వ్యాధి వ్యాప్తిని బాపట్ల జిల్లాలో పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. డయేరియా వ్యాధి నిర్మూలనపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగింది. ముందస్తు జాగ్రత్త చర్యలతోనే డయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టగలమని జిల్లా కలెక్టర్ చెప్పారు. కలుషిత నీరు తాగకుండా ప్రజలకు అవగాహన కల్పించడమే ముఖ్యమన్నారు. ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని అధికారులు తప్పనిసరిగా పరీక్షించాలని ఆయన ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవోలు, పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ కమిషనర్లు తాగు నీటి నమూనాలను పరీక్షలకు పంపాలన్నారు. అధికారులు నిర్లక్ష్యం చేయరాదని ఆదేశించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు నెల చివరి వరకు డయేరియా వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేపట్టాలన్నారు. ఇంటింటా ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆరోగ్యంపై ఆరోగ్య కార్యకర్తలు ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ సచివాలయాల వారీగా కార్యక్రమాల నిర్వహణపై అధికారులు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. చిన్నారులలో డయేరియా మరణాలు పూర్తిగా అరికట్టడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. మలేరియా డెంగ్యూ విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గృహాల మధ్య వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మురికి నీటి కుంటలు, కాల్వలను శుభ్రపరచాలని ఆదేశించారు. పాఠశాలల్లో క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నారులలో డయేరియా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా జింక్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. చేతులు పరిశుభ్ర పరుచుకోవడంపై పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలోని చిన్నారుల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. పరిశుభ్రమైన శుద్ధ జలాలను ప్రజలకు సరఫరా చేయడానికి ఆర్ డబ్ల్యు ఎస్, పంచాయతీరాజ్ ఇంజినీర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, జడ్పీ డిప్యూటీ సిఈఓ మోహన్ రావు, డిపిఓ రవికుమార్, డిఈఓ నారాయణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిందితులు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు, ఒక్కొక్క బృందం సి ఐ, ఎస్ ఐ మరియు సిబ్బంది ఉండి , వివిధ కోణములలో వేగవంతంగా దర్యాప్తు చేసి 48 గంటలలోపు, నేరానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఎఫ్ ఎస్ ఎల్ టీం, క్లూస్ టీం లను నేరస్థలం నకు పిలిపించి, నేర స్థలంలో ఉన్న అన్ని రకాల సాక్ష్యాధారాలు సేకరించారు. అదే విధంగ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితని నేరస్థలానికి పంపారు. హోం మంత్రి ప్రభుత్వం తరుపున హతురాలి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందచేసారు. వీరు గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలై ఉద్దేశపరకంగా యువతిపై అత్యాచారం చేసి హతమార్చడం జరిగిందన్నారు.మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో గంజాయిని పూర్తి స్థాయిలో కట్టడం చేయడానికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కేసులో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, చీరాల డిఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో యువతి పై జరిగిన అత్యాచార మరియు హత్య కేసును దర్యాప్తు సాగించిన చీరాల రూరల్ సి ఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, యువతి తల్లి తండ్రులు, ఇతర సాక్షులు చెప్పిన సమాచారం ఆధారంగా, నేరస్థలాన్ని పరిశీలించి భౌతిక సాక్ష్యాధారాలను పరిగణంలోకి తీసుకొని నిందితుడు దేవరకొండ విజయ్, దేవరకొండ శ్రీకాంత్, కారంకి మహేష్ లు నేరం చేసినట్లు నిర్ధారించుకొని జూన్ 22 శనివారం 2024 సాయంత్రం 7 గంటలకు ముగ్గురు నిందితులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందికేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి భౌతిక సాక్ష్యాధారాలను, నిపుణుల నివేదికను త్వరితగతిన పొంది ఒకదానికొకటి క్రోడీకరించుకుని సంబంధిత న్యాయస్థానంలో ముద్దాయిపై అభియోగ పత్రం దాఖలు చేసి, న్యాయస్థానంలో ముద్దాయికి కఠినమైన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. మహిళల పై నేరాలకు పాల్పడే వారి పట్ల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-దర్శి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ బాధ్యతల స్వీకరణ మహోత్సవంలో దర్శి తెలుగుదేశం జనసేన బిజెపి కూటమినేత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, భర్త డాక్టర్ కడియాల లలిత్ సాగర్, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు పాల్గొని మంత్రి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ సచివాలయంలో శనివారం విద్యుత్తు శాఖ మంత్రిగా డాక్టర్ గొట్టిపాటి రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కడియాల రమేష్, పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

జన్మభూమి రుణం తీర్చుకోవాలి

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తాను పుట్టి పెరిగిన జన్మభూమి రుణాన్ని ప్రతి ఒక్కరూ తీర్చుకోవాలని, గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లాలోని కాజా గ్రామంలో ఏరువాకోత్సవం-పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ పురావస్తు శాస్త్ర నిపుణులు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, మణిమేల శివశంకర్ సంయుక్తంగా రచించిన 'కాజ గ్రామ చరిత్ర-శాసనాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో పుట్టి పెరిగి అభివృద్ధి చెంది ఇతర ప్రాంతాలలో నివాసం ఉండే వారందరూ వారి గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు.

జనసేన నేతలు మొక్కులు చెల్లింపు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మద్దిపాడు మండల పరిధిలోని లింగంగుంట గ్రామంలో వేసి ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద విజయోత్సవ మొక్కులను శనివారం నాడు జనసేన పార్టీ వీర మహిళ కకర్లపూడి హరిత ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలని, కూటమిలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో బి ఎన్ విజయ్‌కుమార్ విజయం కోసం జనసేన పార్టీ పోటీ చేసినటువంటి నియోజకవర్గాల్లో విజయం సాధించినట్లయితే గతంలో లింగంగుంట గ్రామం వద్ద నుంచి మల్లవరం దేవస్థానం వరకు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా జనసేన పార్టీ వీర మహిళ కాకర్లపూడి హరిత లింగంగుంట శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద 108 టెంకాయలు కొడతామని స్వామివారిని వేడుకోవడం జరిగింది. జనసేన పార్టీ పోటీ చేసినటువంటి స్థానాల్లో నూరు శాతం విజయం సాధించడంజరిగింది. ఈ సందర్భంగా స్థానిక మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నుంచి లింగంగుంట గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వరకు జనసేన పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 108 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు నున్న బాలసుబ్రమణ్యం, వెల్లంపల్లి ఎంపీటీసీ అద్దేపల్లి దుర్గాభవాని,జనసేన పార్టీ వీర మహిళ అధ్యక్షురాలు కాకర్లపూడి హరిత,ఉపాధ్యక్షులు ఆరే 0.వెంకటేశ్వర్లు, దమ్ము సురేష్,జనసేన పార్టీ నాయకులుతిరుమల శెట్టి చిరంజీవి, ఏడుగుండ్ల సత్యనారాయణ, కనుపర్తి శేషయ్య, అయినా బత్తిన నాగేశ్వరరావు, కవల బుజ్జి, శివ శంకర వరప్రసాద్,జనసేన నాయకులుకార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరిస్తా: అనుష

విశాలాంధ్ర-త్రిపురాంతకం : తనని పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ విద్యాభివృద్ధికి ఆటోలు ఏర్పాటు చేస్తామని దూపాడు సర్పంచ్ అనుష హామీ ఇచ్చారు. మండలంలోని దూపాడు గ్రామ పంచాయితీలో గల హోసనపురం, దివ్వేపల్లి గ్రామంలో నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబాన్ని శనివారం సందర్శించారు. అలాగే పంచాయితీలో బ్యానర్ తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ, పంచాయితీ,సచివాలయం,అంగన్వాడీ వారు సంయుక్తంగా గృహ సందర్శన ,బడి ఈడు పిల్లల సర్వే నిర్వహించారు.ఈసందర్భంగా పిల్లల తల్లితండ్రులు చెప్పిన వివరాల ప్రకారం పిల్లలు దూరం కావడంతో ఉన్నత విద్యకు దూపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాలకు వెళ్ళలేక పోతున్నారని తెలుసుకున్నారు. పిల్లలు ఉండవలసింది పనుల్లో కాదని బడిలో అని వివరించారు.అనంతరం గ్రామాల్లో పాఠశాలలో చేరే పిల్లలకు స్వాగతం పలికారు.అనంతరం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. తన గ్రామ పంచాయితీలో ప్రతి ఒకరు విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో ప్రత్యేక ఆటోను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి ప్రయోజకులను చేయాలని తల్లి తండ్రులకు సూ చించారు.మీ పిల్లలు నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని దేశ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.గ్రామంలో పిల్లలు విద్యావంతులు కావడంతో మన గ్రామానికి మంచి పేరు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు మల్లికార్జున నాయక్, వెల్ఫేర్ వెంకటేశ్వర్లు, సీ ఆర్ పి శ్యామ్ పాటశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర-శింగరాయకొండ : మండలంలోని పాత శింగరాయకొండలో వెలసివున్న శ్రీ వరాహాల లక్ష్మీనరసింహాస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి బీసీవై పార్టీ వ్యవస్థాపకులు రామ చంద్ర యాదవ్ నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముందుగా మండ లంలోని యాదవ సోదరులు ఆయనకు శాలువాలు కప్పి బొకేలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల బైక్ ర్యాలీతో కొండపైకి తీసుకె ళ్లారు. అక్కడ ప్రధాన అర్చకులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సత్య, బంగారు బాబు యాదవ్, మసనం వెంకటరావు యాదవ్, గాలి బాలాజీ యాదవ్ తాతయ్య యాదవ్, మండలంలోని శ్రీకృష్ణ యాదవ్ ఫోర్స్ పాల్గొన్నారు.

తర్లుపాడులో డౌన్ టు డస్క్ ప్రారంభం

విశాలాంధ్ర-తర్లుపాడు : మండల కేంద్రమైన తర్లుపాడులోని స్థానిక హిందూ ఎలిమెంటరీ పాఠశాలలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డౌన్ టు డస్క్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేసిజిఎస్‌కే వెంకట సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మరియు వాసవి సముదాయ సత్రం కమిటీ సభ్యులు పోలేపల్లి జనార్దన్ రావుల చేతుల మీదుగా కూరగాయల బండి, చిరు వ్యాపారులకు గొడుగులు, టెక్స్ బుక్కులు, పెన్నులు,బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వారు సంయుక్తంగా మాట్లాడుతూ వాసవి క్లబ్ కార్యవర్గ బృందం ప్రాతః కాలం నుండి సూర్యాస్తమయం వరకు పేదల మనుగడ కోసం వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. అందుకే అన్ని ప్రాంతాలలో వాసవి క్లబ్ కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అనంతరం ఏపీజీబి బ్యాంకు మేనేజర్ కే రామకృష్ణ, ఏఎస్ఐ బి రమేష్ బాబు, ఏపిఎం డి పిచ్చయ్యలను వాసవి క్లబ్ బృందం శాలువతో సత్కరించారు. జిల్లా వాసవి క్లబ్ నాయకురాలు కొప్పర్ ప్రత్యమ్మ, పి కృష్ణకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడుఅల్లూరయ్య,ఉపాధ్యాయులు ఎస్.కె నజీర్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒలంపిక్ రన్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బ్రహ్మానందరెడ్డి స్టేడియం నందు శనివారం 'ఒలంపిక్ రన్-2024' కార్యక్రమం గుంటూరు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా స్పోర్ట్స్ అధికారి నరసింహారెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ ఎన్.సుబ్బారావులు ఒలంపిక్ జ్యోతి వెలగించి ఒలంపిక్ రన్‌ను ప్రారంభించారు. క్రీడా సంఘం ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొని ఒలంపిక్ డే రన్‌ను ముగించారు. తొలుత జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా వెంకటేశ్వరరెడ్డి, మాజీ అథ్లెటిక్ రాజేశ్వరరావు, వెంకటరెడ్డి, ఇంటర్నేషనల్ క్రికెట్ ప్లేయర్ నాగభైరు రంజిత్, సీనియర్స్ వాకర్స్ జూడో, స్కేటింగ్, సిలంబో, వాలీబాల్ టెన్నిస్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు టీషర్ట్స్, క్యాప్స్ అందజేశారు. వేణుస్ రిసార్ట్స్ మల్లవరం వారు ఈ కార్యక్రమానికి సహకరించారు.

వైసీపీ కార్యాలయాన్ని కూల్చటం దుర్మార్గం
- దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-కనిగిరి : టీడీపీ ప్రభుత్వం చట్ట వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయాన్ని తెల్లవారుజామున అక్రమంగా కూల్చివేయటం దుర్మార్గమైన చర్య అని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కక్షపూరితంగా కూల్చి వేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి జెడ్పీటీసీ కస్తూరి రెడ్డి, జి ఆదినారాయణ రెడ్డి, దాదిరెడ్డి మాలకొండ రెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

తొలకరి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-ముండ్లమూరు : అన్నదాతలు తొలకరి పనులకు సిద్ధపడుతున్నారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నా, వర్షాలు పడుతుండడంతో రైతులు ఖరీఫ్ పనులకు దిగారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం దుక్కులు జోరుగా జరుగుతున్నాయి. వ్యవసాయంలో యాంత్రికరణ జోరందుకోవడంతో ప్రతి పనికి యంత్రాలపై ఆధారపడుతున్నారు. దుక్కు పనుల్లో రైతులు నిమగ్నమై ఉన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రకు అభినందనలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ ముక్కు ఉగ్ర నర్సింహారెడ్డి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కనిగిరి ఆర్యవైశ్య నాయకులు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుల్లో మాజీ వైస్ చైర్మన్ వివి మనోహర్ రావు, నీలిశెట్టి సుబ్బారావు, కొలిపర్తి మారుతి కుమార్, కోట సురేష్ కుమార్, ఒలేటి చిన్న, కాకుమాని వెంకటేశ్వర్లు (బాబు), ఐవి నారాయణ, కొప్పరపు సత్యాలు,దర్శి వెంకట సుబ్రహ్మణ్యం (యువరాజ్), గోనుగుంట పవన్ కుమార్ ,బొగ్గరపు సద్గురు,వెలుగూరి చంద్రశేఖర్ (పెద్దశెట్టి) బొగరపు సుందర రాజా, పైడిమర్రి సత్యం,శీను, వరప్రసాద్, రాచపూడి వెంకటేశ్వర్లు, పి. కొండలరావు, కోట అంజి, వై శంకర్, అద్దంకి రంగబాబు సోదరులు, తాళ్లూరి మహేష్, అంగలూరి అనిల్ కుమార్, పేర్ల ప్రదీప్ , కోట సుధారాణి, బొగరపు శ్రీలత శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరులోని ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. దీంతో పాఠశాల సమయంలో విద్యార్థులు ,ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాడు నేడు పనుల్లో భాగంగా పాఠశాలల్లో కూడా మరుగుదొడ్లకు డోర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. గత ఆరు నెలల నుండి బిగించకపోవడం, పాఠశాల లు ప్రారంభమైనప్పటికీ పనుల్లో పురోగతిలేకపోవడంతో మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లకు డోర్లు ఏర్పాటు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వీరారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే.వీరారెడ్డి అన్నారు. హనుమంతునిపాడు మండల పరిధిలోని పెద్దముప్పళ్లపాడు గ్రామంలో ఏరువాక పౌర్ణమి రైతు మహోత్సవ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. తొలిత ట్రాక్టర్‌ను మహిళ రైతు నాయకురాలు పూజించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని కనీస మద్దతు ధరలకు పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరారు. అలానే రైతుకు నెలకు పదివేల రూపా యలు చొప్పున పెన్షన్ ఇవ్వాలని, ట్రాక్టర్లకు డీజిల్ యభైశాతం రాయితీపై అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎకరాకు సాగు సాయం క్రింద 15 వేల రూపాయలు తెలంగాణ తరహాలో అందించాలని డిమాండ్ చేశారు.అలానే పెరిగిన వ్యవ సాయ ఖర్చుల దృశ్య స్కేల్ ఆఫ్ ఫైనాన్సు సవరించి మూడు లక్షల లోపు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని,ఐదు లక్షల లోపు పావల వడ్డీ కింద రుణాలు అందించా లన్నారు. కౌలు రైతులకు కౌలు కార్డులను మంజూరు చేసి బ్యాంకుల ద్వారా రుణా లు అందించటం తో పాటు అన్ని రకాల ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.ఎరువులు విత్తనాలు, వ్యవ సాయ పనిముట్లు తొంబైశాతం సబ్సిడీ కింద అందించాలని వారు కోరారు. మధ్య ప్రదేశ్‌లోని మందసోర్ ప్రాంతంలో గిట్టుబాటు ధరలకోసం రైతులు రోడ్డుపై నిరసన తెలియజేస్తుంటే అప్పటి సీఎం ఉద్యమ శివరాజ్ సింగ్ చౌహాన్ పోలీసులతో కాల్పులు జరిపించారన్నారు.ఆ కాల్పుల్లో ఆరుగురు రైతులు బలి అయ్యారు.ఐదు సంవత్సరాలు పరి ష్కరించకుండా పోలీసులు చేత కాల్పులు జరిపించిన చౌహాన్‌కు నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి పదవి ఇవ్వడం ఉద్యమాలను అణగదొక్కుందుకేనని ఎద్దేవా చేశారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు.కృష్ణానది జలాల సమస్యలు పరిష్కరించి,పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు నికరజలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కనిగిరి నియోజకవర్గ గుజ్జుల బాలిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.పి.రామా రావు, ఏఐటీయూసీ నాయకులు ఖాసింవలి, ఏ.ఐ.ఎస్.ఎఫ్.జిల్లా ఉపాధ్యక్షు లు సిహెచ్.పవన్ కళ్యాణ్,రైతు సంఘ నాయకులు ఆర్.రామయ్య నాగేశ్వర రావు, రాజ్యం, గుండాబత్తిన రమణయ్య, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు పుట్టా సుబ్బారావు, రాచూటి సిద్దయ్య,రాచూటి ధనలక్ష్మి, చిన్న బ్రహ్మయ్య, రాచూటి పెద్ద బ్రహ్మయ్య, రాచోటికి రంగమ్మ,రాచూటి శ్రీను మరియు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా కానుక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కూటమి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ప్రత్యేక సంబంధించిన స్టూడెంట్ కిట్లను టీడీపీ,జనసేన,బిజెపి పార్టీలకు చెందిన కూటమి నాయకులు ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని సీతారాంపురం పంచాయతీ నందు హైస్కూల్లో విద్యార్థులకు బ్యాగ్స్,నోట్స్ బుక్స్,స్టడీ మెటీరియల్స్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తదితర నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత చదువులు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మేడం, ఎంపీటీసీ శోభారాణి,విద్యా కమిటీ చైర్మన్ , గ్రామ టీడీపీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, వెంకట రామిరెడ్డి,కనకరాజు, జిలాని, మురళి,భాష,మస్తాన్, ప్రభుదాసు,వెంకటేశ్వరరెడ్డి, నూనె, వెంకటనారాయణ,దేవి రెడ్డి,సతీష్ కుమార్ రెడ్డి,దేవి రెడ్డి,సంజీవరెడ్డి,నూనె గురు మహేష్,దేవరం, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు,పాల్గొన్నారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కొరకు ప్రభుదాసు,కే.వెంకట సుబ్బారెడ్డి,వెంకటరామిరెడ్డి, జిలానీ, కనకరాజులు కలిసి తలుపులు,కిటికీలు ఉచితంగా బహుకరించారు. పాఠశాల ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-పామూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందించడంతోపాటు ఆటపాటల ద్వారా విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందని అంగన్వాడి సూపర్వైజర్ గోళ్ళ పద్మజ అన్నారు. శనివారం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాలలలో ఒకటో తరగతి చేరనున్న చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో బాలింతలకు గర్భిణులకు చిన్నారులు పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సంతానం కలుగుతుందన్నారు. పిల్లలను సమీపంలోని అంగన్వాడి కేంద్రాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మహిళా పోలీస్ శ్రీదేవి, అంగన్వాడి కార్యకర్తలు ఝాన్సీ, అనిత, కృష్ణవేణి, అంజమ్మ, లక్ష్మీరాజ్యం, రాజేశ్వరి, రమీజా మెహరాన్, రోషి, ఇస్రజ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర-కురిచేడు : పిల్లలు ఉండవలసినది పనిలో కాదు బడిలో అంటూ నేను బడికి పోతా అనే కార్యక్రమాన్ని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడి సీఎం నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17న ప్రారంభమై ఈ కార్యక్రమం జూలై 12 వరకు పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యంగా గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించటం పిల్లలను బడిలో చేర్పించడం స్టూడెంట్ కిట్టు ఇతర పోచకం అందించడం విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించే చేపట్టే పనుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ఎంఈఓ వస్త్రం నాయక్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ఉన్న వైఎస్ఆర్ జడ్పీ హైస్కూల్ నుండి ప్రారంభమై ప్రధాన కూడలి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. పిల్లలు బడికి పెద్దలు పనుల్లోనికి పోవాలంటే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ జడ్పీటీసీ నుసుమ్ వెంకట నాగిరెడ్డి గ్రామ సర్పంచి కేసనపల్లి కృష్ణయ్య ఎంపీటీసీ బుల్లెం వెంకట నరసయ్య ఎంపీడీవో సీతారామయ్య డిటి రాధాకృష్ణ హెచ్ ఎం సాయి మండల టిడిపి అధ్యక్షులు విడతల నెమలియ్య మాజీ మండల అధ్యక్షులు నాగరాజు డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సునీల్ నాయకులు గంధం గురునాథం కమతం నాగిరెడ్డి పాపిశెట్టి వెంకటరామయ్య ఆంజనేయులు బిరిగొల్ల బాల వెంకటేశ్వర్లు బాదం సుబ్బారెడ్డి గణపతి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

విశాలాంధ్ర-పామూరు : విశ్వహిందూ పరిషత్, బజరంగ దళ్, ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో శ్రీ వీర హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ మధుర వేణుగోపాల స్వామి దేవస్థానం నుండి ప్రత్యేక వాహనంపై హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసి పట్టణంలోని ప్రధాన వీధులలో కోలాటములు, యువకుల నృత్యాలు, డబ్బు వాయిద్యాలతో హనుమాన్ శోభాయాత్ర సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలోని పారిశుధ్య కార్మికులకు కొంజేటి జాలేంధ్రరావు (జల) ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఆయన జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమంలో నిర్వహించారు. గ్రామంలో ఊరచెరువు అభివృద్ధి పనులను కూడా ఆయన చేపట్టారు. ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి సామ్యూల్, కే.సెల్వం, కొంజేటి రామకృష్ణ బెల్లం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని ఎడమకల్లు గ్రామ సమీపంలోని అమరావతి కడప రాష్ట్ర రహదారిపై శనివారం లారీ ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు కాలే గురువయ్య తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ ద్విచక్ర వాహనదారుడిని స్థానికులు గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు కొమరోలు మండలం బొడ్డువానిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలోనే గతంలో కూడా అధిక మొత్తంలో రోడ్డు ప్రమాదాలు జరిగాయని రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు అండగా సూర్యశ్రీ ట్రస్టు

విశాలాంధ్ర-ఒంగోలు : సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రెటరీ షేక్ సర్దార్ భాష ఆధ్వర్యంలో పేద విద్యార్థి అబ్దుల్లా ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుకు అవసరమైన పుస్తకాలు నోట్ బుక్స్ మరియు సైకిల్ శనివారం ట్రస్టు కార్యాలయంలో సూర్య శ్రీ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ ద్వారా అందజేయడమైనది. మురళీకృష్ణ మాట్లాడుతూ బాగా చదువుతున్న పేద విద్యార్థులకు సూర్య శ్రీ ట్రస్ట్ ఆర్థికంగా అండగా ఉంటుందని తెలిపారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ నరసరావుపేట చెందిన పేద విద్యార్థి అబ్దుల్లా తండ్రి వాచ్మెన్‌గా తల్లి ఇండ్లలో పాచి పని చేస్తుంది. సూర్య శ్రీ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు తెలుసుకొని వచ్చి సహాయం చెయ్యమని కోరగా ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ స్పందించి ప్రవాస భారతీయుడు శ్రీకాంత్ చౌదరి, సతీష్ సహకారంతో అందించారు. చదువుల్లో బాగా రాణిస్తున్న అబ్దుల్లా పదో క్లాసులో 537 మార్కులు సాధించారు. పేద కుటుంబానికి చెందిన అబ్దుల్లాకి ఇంటర్ ఫస్టియర్ పుస్తకాలు నోట్ బుక్స్ మరియు కాలేజీ దూరం వల్ల రేంజర్ సైకిల్ దాతల సహకారంతో అందించి మానవత్వం చాటారు అని తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్ పర్సన్ సయ్యద్ షహనాజ్, సుబ్బారావు రామ్ సాయి. జనసేవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మకు నివాళులర్పించిన మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర-టంగుటూరు : కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ తల్లి బుర్ర లక్ష్మమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. టంగుటూరు మండలం మల్లవరపాడు పంచాయతీ పరిధిలోని శివపురం గ్రామంలో వారి అంత్యక్రియలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి టంగుటూరు మండలం శివపురం గ్రామానికి శనివారం ఉదయం వచ్చారు. బుర్ర లక్ష్మమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించి బుర్ర కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా అక్రమ మద్యం విక్రయాలు

- ◆నరసింహుని గుడి వద్ద అనధికార మద్యం విక్రయాలు
- ◆కూల్ డ్రింక్ షాపులే మందు షాపులు
- ◆తిరునాళ్ల కు మందుబాబులకు ప్రత్యేక ఏర్పాట్ల సౌకర్యం
- ◆చోద్యం చూస్తున్న సంబంధిత శాఖ అధికారులు

విశాలాంధ్ర-సింగరాయకొండ : ఒకపక్క నరసింహ స్వామికి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ రాష్ట్రం నలు మూలల నుండి భక్తులు వేల సంఖ్యలో స్వామివారిని దర్శించుకోవడం కోసం వస్తుంటే ఇదే అదునుగా మందు బాబులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా స్వామివారి గుడి చేరువలోనే అనధికార మద్యం విక్రయాలు చేపట్టారు. ప్రధానంగా నూతనంగా వెలసిన కూల్‌డ్రింక్ షాపులు చిల్లర దుకాణాలు యదేచ్ఛగా మద్యం లభిస్తూ మందుబాబులకు అక్కడే అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ తిరుణాలలో అన్ని గ్రామాల నుండి రాత్రుల పూట ప్రధాన ఆకర్షణగా విద్యుత్ దీపాలతో స్వామివారి ఆలయాన్ని అలంకరిస్తారు. దీన్ని చూడటానికి దూర ప్రాంతాల నుండి కూడా మహిళల సైతం ఈ తిరునాళ్లకు సందర్శిస్తుంటారు. దీంతో మందుబాబులు వీరంగానికి అడ్డు కట్ట లేకుండా పోతుందని సామాన్య భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రధానంగా యువత బ్రహ్మోత్సవాలకు వాలంటీర్లుగా ఏర్పడి మందుబాబులను రానివ్వకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసే వారు. ఈ సంవత్సరం అటువంటి ఏర్పాట్లు లేకపోగా మొబైల్ బ్రాందీ షాపులను ద్విచక్ర వాహనాల్లో తీసుకుని వచ్చి అమ్మే బెల్ట్ బాబులు ఎక్కువగా మారారు. సింగరాయకొండలో సాధారణంగా బెల్టు షాపులు నిర్వహించే వారే తిరునాళ్ల సందర్భంగా పాత సింగరాయకొండ లో ఈ దుకాణాలు ఏర్పాటు చేశారు వీరిపై ఎటువంటి చర్యలు లేకపోగా నెలసరి మామూళ్లతో సంబంధిత శాఖ అధికారులు సీత కన్ను వేశారన్న వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి.

నెలసరి మామూళ్లతో మిన్నకుండడంతో తిరుణాలలో సైతం యదేచ్ఛగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారని సామాన్య ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తిరునాళ్లకు మహిళలను పసిపిల్లలను తీసుకు వచ్చే ఆలోచనలపై సామాన్య భక్తులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు కనీసం ఇప్పటికైనా ప్రధానంగా జరుగు ఈ మూడు రోజులు మద్యం అమ్మకాలు గుడి చెరువులో లేకుండా చూడాలని పోలీసులను కోరుకుంటున్నారు.

చేకూరపాడులో ఘనంగా ఏరువాక

విశాలాంధ్ర-ఒంగోలు: నాగులుప్పలపాడు మండలం చేకూరుపాడు గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వడ్డెళ్ళ ప్రసాద్ రైతు సంఘం జెండా ఊపి ప్రారంభించారు. తదనంతరం జరిగిన రైతుల సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వడ్డే హనుమా రెడ్డి మాట్లాడుతూ గతంలో ఏదో ఒక కార్యక్రమాన్ని గ్రామాల్లో ఒక పండగ లాగా జరుపుకునే వారని ఎద్దులు పశువులు వ్యవసాయ పనిముట్లు పూజలు చేసి పంటలు బాగా పండాలని పాడి వృద్ధి చెందాలని కోరుకుంటూ వ్యవసాయాన్ని ప్రారంభించే వారని అన్నారు. వ్యవసాయ పరిస్థితుల్లో వచ్చిన మార్పు కారణంగా ఈ సాంప్రదాయం మరుగున పడుతోందని రైతుల మధ్య ఐక్యత అవినా బావ సంబంధాలు పెరగటానికి ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఏపీ రైతు సంఘం ఏరువాక కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. రైతులు కష్టం నష్టాలకోర్చి పంటలు పండించినప్పటికీ గిట్టుబాటు ధరలు అందక నష్టాలపాలై ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారని ప్రభుత్వాలు మారిన రైతుల పరిస్థితి మార లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రైతులకు అనేక హామీలు ఇస్తున్న నాయకులు ఎన్నికల తర్వాత అన్నారు. రైతులందరూ రైతు సంఘం సభ్యులుగా చేరి గ్రామ కమిటీల ఏర్పాటు చేసుకోని ఐక్యంగా కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయవలసిన అవసరం ఉందని అన్నారు. 50శాతం సబ్సిడీ మీద ట్రాక్టర్లను అందించాలని గుర్తింపు కార్డులు ఇచ్చి డీజిలు 50శాతం సబ్సిడీ ఇవ్వాలని అరకలతో వ్యవసాయం చేసే రైతులకు ఎద్దుల కొను గోలుకు 50 శాతం సబ్సిడీ అందించాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి తుమ్మల వీరయ్య అధ్యక్షత వహించారు. సమావేశంలో స్వర్ణ కృష్ణయ్య, పొగాకు రైతు సంఘం నాయకులు వడ్డెళ్ళ ప్రసాద్ ,పోకూరి వెంకటేశ్వర్లు , రైతు సఘం నియోజకవర్గ నాయకులు చెరుకూరు వాసు, పోలవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు గ్రామ సమీపంలో గల ఎస్సీ కాలనీ వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి సీజ్ చేశారు. గతంలో పనిచేసిన తహసిల్దార్ మహమ్మద్ నయీమ్ అహమ్మద్ సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుక డంపును ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, మైనింగ్ ఏడి వీరేష్, మైనింగ్ ఆర్ ఐ మురళీకృష్ణ, సబ్ సీఐ బి సుందర్రామయ్య శనివారం పరిశీలించారు. సీజ్ చేసిన ఇసుకపై ఎటువంటి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేసి తహసిల్దార్ కార్యాలయానికి ఇసుకను స్వాధీనం చేయడం జరిగింది. ఆ ఇసుకకు సంబంధించి పర్మిషన్ వచ్చిన తర్వాత వేలం నిర్వహిస్తామని ఆర్డీవో సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జే మధుబాబు, డిప్యూటీ తహసిల్దార్ జి పుల్లారెడ్డి, వీఆర్వో రమణ, సుశీల రాణి, విఆర్ఓ పున్నారావు, సర్వేయర్ కళ్యాణ్, వెంకటరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-సింగరాయకొండ : సింగరాయకొండ మండలం మండలం కార్యాలయం నందు శనివారం 23-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించ డంలో భాగంగా కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేయటం జరిగింది. మండల పరిషత్ అభివృద్ధికి అధికారి ఎన్ నగేష్ కుమారి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి మాట్లాడుతూ సక్రమంగా చేసిన పనులను సక్రమంగా చూయించి సామాజిక తనిఖీ సహకరించాలని కోరారు. ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు సామాజిక తనిఖీ బృందం వారికి వసతులు ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ఉపాధి సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు సామాజిక తనిఖీ బృందం వారు పాల్గొనడం జరిగింది.

పవన్ కళ్యాణ్‌ను అభినందించిన ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ని సచివాలయంలో మర్యాదపూర్వకంగా ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కలిశారు. సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసిన అన్నీ సీట్లు గెలవటంపై ఆయన పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

విశాలాంధ్ర-పర్చూరు: విదేశీ విద్యా పథకానికి అంబేద్కర్ పేరును తొలగించి జగన్ పేరు పెట్టుకొని భ్రష్టు పట్టించారని ప్రజా కూటమి నాయకులు అవేదన వ్యక్తంచేశారు. స్థానిక బొమ్మల సెంటర్లో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సాంఘిక శాఖామంత్రి బాల వీరాంజనేయస్వామి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వైసీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన 27 పథకాలను తొలిగించారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ప్రజా కూటమి నాయకులు నలిగల కిషోర్, వడ్డిముక్కల అబ్రహం, కంభం మార్కు, జూపూడి మార్కు, ఏవీ కృష్ణ, గేరా శ్యామ్, కోడూరి శేషబ్రహ్మాచారి, నలతోటి సుధాకర్, ఆనంద్, కారంపూడి సందీప్‌తేజ, కటారి సురేంద్ర, రామ్ లక్ష్మణ్, తులసి శ్రీనివాసరావు, షేక్ గౌస్, తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని రామన్నపేట పంచాయతీ ఇందిరా కాలనీలో విద్యుత్ ఘాతానికి గురై సూడిగేద చనిపోయింది. విద్యుత్ వైర్లు సూడి గెద పై తెగి పడటంతో ఒక గేదె, ఒక పంది అక్కడికక్కడే మరణించాయి. మరణించిన గేదె విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని గేదె యజమాని దంతం నాగేశ్వరరావు తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలన వైర్లు తక్కువ ఎత్తులో ఉండటం వలన ప్రమాదం జరిగి గేదె చనిపోయిందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి దానిపై ఆధారపడుతున్న నాకునష్టపరిహారం అందించాలని గేదె యజమాని కోరారు.

అన్నంరాజు సుబ్బారావు ఆకస్మిక మృతి

విశాలాంధ్ర - వేటపాలెం : పేరుపొందిన సంఘ సేవకులు వేటపాలెం మండలం కొత్తపేటకు చెందిన అన్నంరాజు సుబ్బారావు(65) అనారోగ్యంతో ఆకస్మిక మరణం పొందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఉన్న సుబ్బారావు మృతి చెందడం పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసారు. రోటరీ క్లబ్, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, రెడ్ క్రాస్, బ్రాహ్మణ సంక్షేమ సంఘం, తెలుగు భాషా సమాఖ్య తదితర స్వచ్ఛంద సంస్థల్లో పదవులు చేపట్టి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి స్వయంగా 60 సార్లకి పైగా రక్త దానం చేసారు. గత నలభై సంవత్సరాలుగా వివిధ స్వాతంత్ర్య ఉద్యమ కారులు, తెలుగు కవుల జయంతులు, వర్ధంతులు జరిపి పేరు పొందారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఏలూరి చర్యలు

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి లేఖ
- ఆటోనగర్,సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు స్థలం కేటాయించాలని వినతి
- తహశీల్దార్ కార్యాలయాలకు మరమ్మతులు చేపట్టి ఆధునికరించాలని విజ్ఞప్తి

విశాలాంధ్ర - మార్టూరు : పర్చూరు నియోజకవర్గంలో అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు శనివారం అసెంబ్లీలో పలు సమస్యలకు సంబంధించి లేఖలను మంత్రికి అందజేశారు. త్వరితగతిన రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ప్రధానంగా పర్చూరు నియోజక వర్గంలోని అత్యధిక సంఖ్యలో యువతకు ఉపాధి కల్పించేందుకు, ముస్లిం సోదరులకు జీవనోపాధి పొందేలా ఆటోనగర్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రిని ఎమ్మెల్యే ఏలూరి కోరారు. ఇంకొల్లు, మార్టూరు, పర్చూరులలో ఆటోనగర్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలని పేర్కొన్నారు. అంతేకాక సీఎం చంద్రబాబు ఇంకొల్లు పర్యటనలో నియోజకవర్గం లోని ముస్లిం సోదరుల అభ్యున్నతికి ఇంకొల్లు, మార్టూరు,పర్చూరు మండల కేంద్రాలలో ఆటోనగర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. దీనిపై వేగవంతంగా చర్యలు చేపట్టి మూడు ప్రాంతాలలో ఆటోనగర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని తాసిల్దార్ కార్యాలయాల మరమ్మత్తులు చేపట్టి ఆధునికరించాలని కోరారు. దశాబ్దాల క్రితం నిర్మించిన కార్యాలయాలు కావడంతో ప్రస్తుతం వర్షాకాలంలో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రికి వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలైన పర్చూరు మార్టూరు ,యద్దనపూడి ,కారంచేడు,ఇంకొల్లు, చిన్నగంజాం తాసిల్దార్ కార్యాలయాల మరమ్మత్తులు చేపట్టి ఆధునికరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, స్థలం కేటాయించి నూతన భవనాలను నిర్మించాలని ఎమ్మెల్యే ఏలూరి మంత్రిని కోరారు. నియోజకవర్గంలోని మార్టూరు, పర్చూరు ,ఇంకొల్లు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు అద్దె అద్దె భవనాల్లో ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి అనగాని తక్షణమే చర్యలు తీసుకుంటామని ఏలూరికి హామీ ఇచ్చారు.

ముస్లిం సోదరుల సమస్యలు పరిష్కరిస్తా: మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - కొరిశపాడు : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమా ర్‌ను శనివారం అమరావతిలోని సచివాలయంలో ప్రకాశం జిల్లా ముస్లిం సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ముస్లింల సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని రవికుమార్ భరోసా ఇచ్చారు. ముస్లింలకు సంబంధించి ఏ సమస్య వచ్చినా వెంటనే తనను సంప్రదించాలని రవికుమార్ సూచించారు. తెలుగుదేశం పార్టీ ముస్లిం సోదరుల వెన్నంటే ఉంటుందని రవికుమార్ పేర్కొన్నారు. అనంతరం సర్దార్ ఖాన్ ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజును మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని రఘురామ కృష్ణంరాజు తెలియజేశారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి

విశాలాంధ్ర - అద్దంకి : రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి వేడుకలను శనివారం పట్టణంలోని కాకాని పాలెం సచివాలయం దగ్గర పొలంలో ఘనంగా నిర్వహించారు. భూమికి. ఎద్దులకు పూజలు జరిపి నవధాన్యాలు చల్లారు. 8 జతల ఎద్దులతో అరకలు సాగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణ మాట్లాడుతూ మనది వ్యవసాయ దేశమని రైతు లేనిదే రాజ్యం లేదని దేశానికి రైతే వెన్నెముక అని అలాంటి రైతు ఏరువాక రోజు భూమికి పూజ చేసి దుక్కి దున్ని వ్యవసాయం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం ఎద్దులతో వ్యవసాయం చేసే రైతులను రోటరీ క్లబ్ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చిన్ని మురళీకృష్ణ. రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు సంగిరెడ్డి శ్రీనివాసరావు. కార్యదర్శి చప్పిడి వీరయ్య. రోటరీ సభ్యులు జ్యోతి చంద్రమౌళి. పుట్టినరోజు శ్రీరామచంద్రమూర్తి. ఊటుకూరి రామ కోటేశ్వరరావు. రైతులు నరిశెట్టి కోటేశ్వరరావు. నరిశెట్టి హనుమంతరావు కాకాని హనుమంతరావు. తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5 నుంచి 9వ తరగతులలో మిగిలిన సీట్లలలో ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ, బీసీ- సీ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.కోటేశ్వర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన అభ్యర్థులు ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 28 న ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.ఈ ప్రవేశ పరీక్షకు హాజరై అభ్యర్థులు తప్పనిసరిగా తమ వెంట ఆధార్ కార్డు, క్యాస్ట్ సర్టిఫికెట్ నకళ్ళను తీసుకురావా లని సూచించారు. వివరాలకు సెల్ : 8500066430కు సంప్రదించాలని కోరారు.

డెల్టా ప్రాంతంలో దుక్కులు ప్రారంభించిన రైతులు

విశాలాంధ్ర - రేపల్లె : ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులు ఆలయాలలో పూజలు, అభిషేకాలు శనివారం నిర్వహించారు. ఆలయాలు చుట్టూ నాగలి కట్టిన ఎడ్లను ప్రదక్షిణలు చేయించారు తమ భూముల్లో దుక్కులు దున్నటం ప్రారంభించారు. ఈ ఏడాది సుభిక్షంగా పంటలు పండాలని సంకల్పం చేసిన అర్చకులు మూలవిరాట్ స్వరూపానికి పంచామృత అభిషేకం చేశారు .శివాలయాల్లో అభిషేకాలు ,గణపతి ఆలయాల్లో పూజలు, జరిపించారు .రేపల్లె నియోజకవర్గం లోని పలు గ్రామాలలో శనివారం రైతులు పూజలు అభిషేకాలు నిర్వహించి ఏరువాక పౌర్ణమికి స్వాగతం పలికారు.

మాజీ సైనికులకు ప్రశంసాపత్రాల అందజేతపై హర్షం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన మాజీ సైనికులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసా పత్రాలు పంపించారని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఎస్పీ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాపట్ల టౌన్ లోని విజయ లక్ష్మి పురం మాజీ సైనిక సంక్షేమ కార్యాలయంలో సాంబశివరావు ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు లకి ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు అధికారి కోరిక మేరకు ఎన్నికల సమయంలో మాజీ సైనికులు విజయవంతంగా నిర్వహించారన్నారు. జిల్లాలో మెజారిటీ అసోషియేషన్ లు బాపట్ల, రేపల్లె, నిజాంపట్నం, చెరుకుపల్లి, చందోలు, పర్చూరు, వేమూరు అసోసియేషన్ ల నుండి ఎన్నికల విధులు నిర్వహించి మాజీ సైనికుల ఔన్నత్యాన్ని చాటిన మాజీ సైనికులకు, ఆయా అసోసియేషన్ ల అధ్యక్షులకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పుట్టా ఆది శేషా రెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు డి వెంకటేశ్వర్లు, సిహెచ్ కృష్ణా రావు, మర్రి వీరాస్వామి, కే ఆంజనేయులు, పసుపులేటి ప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, కె.ఎస్. న్ ప్రసాద్, పీటా సారథి, నంగనం నాగరాజు మొదలగు మాజీ సైనికులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఆదేశాల మేరకు ఈనెల 29 తేదీన రేపల్లె న్యాయస్థానం నందు జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని రేపల్లె మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు తెలిపారు ఈ అదాలత్ లో సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ ,రాజీ పడదగిన కేసులను పరిష్కరించడం జరుగుతుందని కావున రేపల్లె న్యాయస్థాన పరిధిలోని నగరం, నిజాంపట్నం ,చెరుకుపల్లి, భట్టిప్రోలు, రేపల్లె మండలాల కక్షిదారులు లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

యోగా సాధనతో ఆరోగ్య సమస్యలకు చెక్

విశాలాంధ్ర-కూచిపూడి : యోగా సాధన తో ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవ చ్చునని ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్ ఎం భాగ్యలక్ష్మి పేర్కొ న్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మొవ్వ మండలంలోని కాజ ఆయుష్ వైద్యశాలలోనియోగా శిక్షకులు మంద మాధవి హరీష్ రెడ్డి, రాయన నరసింహారావుల సారధ్యంలో ఆయుష్ వైద్యశాలలో,శ్రీ పేకేటి నరసారెడ్డిజిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రాధాన్యతను గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రమణి, ఉపాధ్యాయులు, పామర్రు నియోజకవర్గ బిజెపి కో కన్వీనర్ కొల్లూరు రమేష్ బాబు తదితరులు యోగా శిక్షకులతో పాల్గొన్న అంతర్జాతీయ యోగా దినోత్సవం లో 120 మందికి పైగా విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని నిడుమోలుసెక్టార్లోగలమంత్రి పాలెం అంగన్వాడీ కేంద్రంలో శనివారం"గ్రాడ్యుయేషన్ డే"వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక విద్యకు అర్హులైన ప్రీస్కూల్ పిల్లలకు ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో చేరటానికి వీలుగా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. నిడుమోలు సెక్టార్.సూపర్వైజర్ అబ్దుల్ సలీమున్నీసా ఆధ్వర్యంలో సభా కార్యక్రమాలు నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీస్ ఎం అనిత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బి మౌనిక, ఎం.ఎల్ హెచ్ వి వి శిరీష, ఎంపీయుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రత్న మాణిక్యం, అంగన్వాడీ కార్యకర్తలు వివి శేషు కుమారి, బి సుస్మిత, జే బేబీ, సిహెచ్ సునీత, వి మహాలక్ష్మి, ఆశా కార్యకర్త ఎం శాంతకుమారి లు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అమరావతి రైతుల అభినందనలు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ఎమ్మెల్యేగా వెనిగండ్ల రాము రికార్డు మెజార్టీతో విజయం సాధించడంతో శనివారం అమరావతి రైతులు స్వాగతం పలికి రాముకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. రెండోరోజు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అమరావతి రైతులు ఘన స్వాగతం పలికి ప్రత్యేకంగా అమరావతిలోని మందడం గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అమరావతిని వేతిరేకించిన దుర్మార్గుడైన మాజీ మంత్రి కొడాలి నాని అసెంబ్లీలో అడుగుపెట్టకుండా, చిత్తుచిత్తుగా ఓడించిన ఎమ్మెల్యే రాముకు పూలమాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : చీరాల మండలంలోని ఈపురుపాలెంలో సుచరితపై సామూహిక అత్యాచారం చేసి చంపడం చాలా బాధకరమని బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ పేర్కొ న్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిం చడం అభినందనీయం అన్నారు. హోం మినిస్టర్ వంగలపూడి వనిత వచ్చి చనిపోయిన యువతి కుటుంబాన్ని పరామర్శించడం, సంఘటన ప్రదేశాన్ని సందర్శించడం వారి బాధ్యతకు నిదర్శనంగా నిలిచిందన్నారు. ఇదే జిల్లాలో అక్కను అల్లరి చేస్తుంటే అల్లరి మూకలను అడ్డుకున్నందుకు అమర్ నాథ్ గౌడ హత్య కాబడినపుడు గత వైకాపా ప్రభుత్వం డ్రామాలాడిందని బాధిత కుటుంబాన్ని ఓదార్చిన తీరు లేక పోయిందన్నారు. హోం మంత్రి నేరుగా సంఘటన ప్రదేశాన్ని సందర్శించడం శాంతి భద్రతలకు ఊతమిస్తాయని ఆశ కలిగిస్తుంది. ఇలాంటి ఘటనలపై ఘాతకులను వెంటనే అరెస్టు చేసి త్వరితగతిన కఠినమైన శిక్ష విధించేలా తీర్పు ఇవ్వాలని ఆయన కోరారు. గంజాయి నివారణ పై ప్రత్యేక దృష్టిసారించాలని గత ఐదు రోజుల క్రితం ఓ ఇంజనీరింగ్ విద్యార్థి గంజాయి సేవించడంతో మతిస్థిమితం బారినపడి సంఘటన చోటుచేసుకుందన్నారు. ఆ యువకుడికి బాపట్ల ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స అందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుకుంటున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎన్.ఎస్.పి రాజు, మారం రవికుమార్, జిల్లా న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజన్, పట్టణ యువజన అధ్యక్షుడు గోపీనాథ్, భాను తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ 30 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మే ళనం శనివారం ఘనంగా జరుపుకు న్నారు. అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్వి.సాయి కిషోర్ మాట్లాడుతూ 1995లో స్థాపించి 29 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల పాల్గొని మాకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకుని పాత జ్ఞాపకాలు పంచుకున్నాము. విచ్చేసిన పూర్వ విద్యార్థులు తమ తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ జీవితంలో ఎలా ఎదిగామో వివరించారు. కాలేజీని ఇన్నేళ్ల తర్వాత చూడటం తోటి విద్యార్థిని విద్యార్థులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కాలేజీలోనే అధ్యాపకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. తమ వంతు సహాయ సహకారాలు అందించడంలో ఎల్లవేళలా ముందు ఉంటామని పేర్కొన్నారు. ఇకనుండి తరచూ ఇటువంటి కార్యక్రమాలు జరిపి తద్వారా రానున్న కాలంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఉపాధి - ఉద్యోగాలలో అవగాహన కల్పించుతామని తెలియజేశారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బొల్లా శ్రీనివాసరావు ఎండి, (వల్లభ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్)ఏ.సుధాకర్ (రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ రెడ్డి లాబరేటరీస్)వై.ప్రశాంత్ ఏజీఎం (మైలాన్ ఫార్మా సిటికల్ ప్రైవేట్ లిమిటెడ్)జి. మధుసూదన్ రావు అసిస్టెంట్ మేనేజర్ (మైలాన్ ఫార్మాసిటికల్ ప్రైవేట్ లిమిటెడ్) బి ఈ సి ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లు : దోప్పలపూడి రామ్మోహనరావు, జి. దిలీప్ కుమార్, జాయింట్ సెక్రటరీ కె. హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టీ. రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

జూలై 1 నుండి ఆగస్టు 31 వరకు 'స్టాప్ డయేరియా' : కలెక్టర్ బాలాజి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : డయేరియా నియంత్రణ కోసం జిల్లాలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలలపాటు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహణకు కార్యాచరణ రూపొందించి, పటిష్టవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం కలెక్టరేట్ లో మున్సిపల్ కమిషనర్లు, వైద్య, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి డయేరియా నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి కాలుష్యం కారణంగా డయేరియా బారిన పడే అవకాశం ఉందన్నారు. కావున తాగునీరు కలుషితం కాకుండా గ్రామాల్లో పట్టణాల్లో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు రెగ్యులర్గా తనిఖీ చేసి, క్లీనింగ్ చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు క్లీనింగ్ చేసినట్లు చుట్టుపక్కల వారితో సంతకం తీసుకొని వారి ఫోన్ నెంబర్ నమోదు చేయాలని, ఇందుకోసం రిజిస్టర్ నిర్వహించాలన్నారు. తాను స్వయంగా ర్యాండంగా తనిఖీ చేసి రిజిస్టర్లు పరిశీలిస్తామన్నారు. క్లీన్ చేశాక ట్యాంకులపై సరైన మూతతో మూసి ఉంచాలని, లేనియెడల బల్లి, పురుగులు వంటివి ట్యాంక్ లో పడి, మనకు తెలియ కుండానే తాగునీరు కలుషితం అవుతుందన్నారు. తాగు నీటిని సరైన విధంగా క్లోరినేషన్ చేయాలని, ఇది చాలా ప్రాముఖ్యం అన్నారు. నీటి శాంపుల్స్ పరీక్షలు జరపాలన్నారు. వాటిని బయోలాజికల్ ఎనాలసిస్ తప్పనిసరిగా, ఎక్కువసార్లు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో వార్డు సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీలు, గ్రామాల్లో వార్డు సచివాలయంలోని ఇంజనీర్ అసిస్టెంట్లు వారి పరిధిలోని పైపులైనులన్నీ తనిఖీ చేసి, లీకేజీలు ఉంటే అరికట్టి, మున్సిపల్ కమిషనర్లకు, ఎంపీడీవోలకు సంతకం చేసిన సర్టిఫికెట్ లు సమర్పించాలని, వారు వాటిని జిల్లా అధికారులకు పంపాలన్నారు. ప్రైవేట్ ఆర్ ఓ ప్లాంట్లలో కూడా నీటి పరీక్షలు జరపాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడం, పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రత పట్ల పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వంట సిద్ధం చేసే ప్రదేశాల్లో పరిశుభ్రత పాటించాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలనిలి ప్రజలకు విద్యార్థులకు అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా పైప్ లైన్ లీకేజీలు గుర్తిస్తే, వెంటనే ఆ విషయం ఆయా పంచాయతీ కార్యదర్శులు లేదా ఎంపీడీవో లేదా మున్సిపల్ అధికారులకు తెలియజేసి మరమ్మత్తులు చేయించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ఏఎన్ఎం అంగన్వాడి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పూర్తి భాగస్వామ్యంతో వ్యక్తిగత పరిశుభ్రత పై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ సల్ఫేట్ టాబ్లెట్లు ఇంటింటికి పంపిణీ చేయాలన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు రెండు నెలల పాటు నిర్వహించే డయేరియా నియంత్రణ ప్రచార కార్యక్రమాన్ని ఐదేళ్ల లోపు చిన్నారులు ఎవరు డయేరియాతో చనిపోకూడదనే లక్ష్యంతో కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్, ఆరోగ్య సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి గీతాబాయి, డీఈవో తాహెరా సుల్తానా, డిపిఓ నాగేశ్వర నాయక్, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి టి శివప్రసాద్, జెడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు బాలసుబ్రమణ్యం పి. వెంకటేశ్వరరావు, కే వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పిడి ఎస్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీటిని తొలగించండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-గుడివాడ : ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయులు అందజేయడం ఎంటు వంటి అలసత్వం చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం పట్టణంలోని బసుస్టాండు, కొత్తి బోమ్మ సెంటర్‌ల వద్ద నూతన డ్రైనేజీ పనులు వల్ల మురుగునీరు రోడ్ల మీదకు రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సదరు విషయాన్ని తెలుసకున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులతో ఫోనులో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఫ్లై ఓవర్ బిడ్జి పనుల శరవేగం జరగడం వల్ల కొన్ని సమస్యలు వస్తున్నాయాని వాటి విషయంలో మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని సూచిచారు.

రైల్వేస్టేషన్‌లో సెల్‌పోన్లు రికవరీ

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన సెల్ ఫోన్లను తిరిగి పోగొట్టుకున్న వారికి శనివారం అందజేశారు. ఈసందర్బంగా రైల్వే ఎస్.ఐ బి.వెంకటేశ్వర్లు విలేకర్లుతో మాట్లాడుతూ గుడివాడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొంతకాలంగా పోయిన సెల్ఫోన్లను వివరాలను సేకరించి పోలీసు సంకేతిక విధనం ద్వారా పోయిన సెల్ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేయాడం జరిగిందన్నారు. సుమారు 1లక్ష విలువ చేసే సెల్ పోన్లలను పోగొట్టుకున్న వారికి అందజేయడం జరిగిందన్నారు. రైలులో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సెల్ఫోన్లోని చార్జింగ్ పెట్టి నిద్రపోతున్న సమయంలో తరచుగా ఈ సెల్ఫోన్ దొంగతనాలు జరుగుతాయన్నారు. వాటిని అరికట్టడానికి ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కోసూరులో గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర-కూచిపూడి : పూర్వ ప్రాథమిక పాఠశాల (అంగన్వాడి కేంద్రాలు) లో శిక్షణ పొందిన విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో నే చేరి ఉన్నతులుగా ఎదగాలనికోసూరు గ్రామ సర్పంచ్ పెనుమూడి రమేష్ బాబు పేర్కొన్నారు. మొవ్వ మండ లం కోసూరులో పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలన్నీకలిపి ఒక కేంద్రంలో శనివారం గ్రాడ్యుయే షన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ హాజరై ప్రభుత్వ పాఠశాలలో చేరితే కలిగే ప్రయోజనా లను, ఉపయోగాలనుపిల్లల తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ డొక్కు భూలక్ష్మి గ్రాడ్యుయేషన్ అయిన పిల్లలకు సర్టిఫికెట్ల ప్రధానం చేశారు. మొవ్వ సెక్టార్ సూపర్వైజర్ ఏసుగు పుణ్యవతి, అంగన్వాడి కార్యకర్తలు టి శిరీష, ఎం పరిమళ గౌరమ్మ, జీవి శివ కుమారి, పి పద్మావతి పాల్గొన్నారు.

రవాణా రంగానికి సహకారం

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట: నగరంలోని ఎంజీ రోడ్డు మురళీఫార్చ్యూన్ హోటల్‌లో ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్సియర్స్ అసోసియేషన్ స్వర్ణోత్స వాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఉమేష్ జీ రేవంకర్, శ్రీరామ్ ఫైనాన్స్ ఎండి చక్రవర్తి ఎఫ్ ఐహెచ్ పిఐ ఛైర్మన్ పూర్ణచంద్రరావు అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులు అసోయేసన్ సభ్యులతో కలిసి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుమూలల నుంచి ఆటో ఫైనాన్స్, రవాణ రంగం ప్రతినిధులు పాల్గొ న్నారు. అనంతరం కొల్లు రవీంద్ర మాట్లాడుతూ 1974లో 6 సభ్యులతో ప్రారంభమైన కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ప్రైవేటు ఫైనాన్సియర్స్ అసోసియేషన్ నేడు 170 మందితో విజయవంతం ముందుకు సాగటం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ నగరంలో ఆటో మొబైల్ రంగం అభివృద్ధి చెంద టానికి ప్రధాన కారణం ప్రైవేటు, ప్రభుత్వ ఫైనాన్స్ రంగాలు కొల్లు రవీంద్ర తెలిపారు. మాజీ ప్రధానమంత్రి పివి నరసింహారావు తీసుకువచ్చిన సంస్క రణలతో దేశంలో ఫైనాన్స్ రంగం అభివృద్ధి చెందినట్లు గుర్తు చేశారు.. బందరు పోర్టు నిర్మాణం త్వరలో పూర్తి అవుతోందని తద్వారా రవాణ అభివృద్ధి చెందుతోందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఫైనాన్స్ రంగానికి పూర్తి సహకారాన్ని అందిస్తామని భరోసా కల్పించారు. అనంత రం ఎమ్మెల్యే గద్దె రామ్మోహాన్ మాట్లాడుతూ కష్టమర్లకి ఎక్కువ సర్వీసు చేసినప్పుడే నిజమైన అభివృద్ధి చెందుతోందని గద్దె రామ్మోహాన్ అన్నారు. దేశంలో ఫైనాన్స్ రంగం పాత్ర ఎంతో ఉందని ఉన్నారు. ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఫైనాన్సియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ మాట్లాడు తూ 50 ఏళ్ల స్వర్ణోత్సవాలు సందర్భంగా డ్రైవర్లకి ఉచిత మెగా వైద్య శిబిరం రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. 50 సంవత్సరాల్లో పర్మిట్లు, ఫిటినెస్ ఫెనాల్టిలు ఫ్రెస్ ఆర్‌సీటీఆర్ ఎన్నో విజయాలను అసోసియేషన్ సాధించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోయేషన్ కార్యదర్శి నాగార్జున, ఛైర్మన్ జీజేసి కమీటి వీజీకే ప్రసాద్ అసోసియేషన్ సభ్యులు ఏపి, కృష్ణాజిల్లా లారీ యాజమానులు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు..

టీడీపీ సీనియర్ నాయకుడు చిట్టిబాబు మృతి



విశాలాంధ్ర-కృత్తివెన్ను : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు నీలిపూడి గ్రామానికి చెందిన పుప్పాల చిట్టిబాబు ఆకస్మికంగా మృతి చెందారు. చిట్టిబాబు మృతదేహానికి నివాళులర్పించిన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిట్టిబాబు కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చిట్టిబాబు మృతి తెలుగుదేశం పార్టీకి తీరంలోని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి ఎన్నికల్లో విజయంతో పార్టీ విజయ సంబరాల్లో ఉన్న సమయంలో చిట్టిబాబు మృతి దురదృష్టకరమని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఉదయం నుండి పెద్ద ఎత్తున చిట్టిబాబు మృతదేహానికి నివాళులు అర్పించారు. టిడిపి పార్టీ మండల కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, మాజీ పిఎసీఏ అధ్యక్షులు పాశం సుబ్రమణ్యం, జనసేన పార్టీ మండల కన్వీనర్ పాసిం నాగమల్లేశ్వరరావు తదితర నాయకులు చిట్టిబాబు మృతదేహానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు

విశాలాంధ్ర-అవనిగడ్డ : నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు, కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు బస్‌పాస్‌లు ఎపిఎస్ఆర్‌టిసి అవనిగడ్డ డిపోలో ఇవ్వడం ప్రారంభించడం జరిగిందని డిపో మేనేజర్ కె హనుమంతురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు 10 వ తరగతి వరకు, బాలురకు 12 సంవత్సరాల వయస్సు వరకు ఉచిత బస్ పాస్‌లు విద్యార్థుల యొక్క నివేశిత స్థలం నుండి పాఠశాలకు (20 కి.మీ దూరం వరకు) ఉచిత పాస్‌లను తీసుకునేందుకు విద్యార్థులు పాఠశాల నుండి స్టడీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు రెండు తీసుకుని డిపోలో 50 రూ॥ రుసుము చెల్లించి ఈ పాస్‌లు ఏప్రిల్ 30 ,2025 వరకు ఉపయోగపడే విధంగా తీసుకోవాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఉచిత పాస్‌లను తీసుకోవాలని, అదే విధంగా హై స్కూల్, కళాశాల విద్యార్థులకు రాయితీ పాస్‌లు కూడా ఇవ్వడం ప్రారంభిం చడం జరిగిందని, రాయితీ పాస్‌లను 3వ వంతు చార్జీ మాత్రమే చెల్లించి పాస్‌లను పొందాలన్నారు. ఈ రాయితీ పాస్‌లు విద్యార్థులకు నివేశిత స్థలం నుండి 50 కి. మీ దూరం వరకు ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు బస్ పాస్‌లతో ఆర్.టి.సి బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని హనుమంతురావు కోరారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-గుడివాడ : పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం ఆదివారం విద్యుత్ సరఫరాలలో అంతరాయం జరుగుతుందని విద్యుత్ ఇంజనీర్ టి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ ఆదివారం స్థానిక ఆటోనగర్, ఆర్‌టిసి కాలనీ, బ్యాంక్‌కాలనీచ చౌదరిపేట, లక్ష్మీనగర్‌కాలనీలలో విద్యుత్ మర్మమత్తులు నిర్వహిస్తున్నట్లు, ఈ ప్రాంతాలలో ఉదయం 8గం॥ల నుండి మధ్యాహ్నం 12గం॥ల వరకు విద్యుత్ సరఫర అంతారాయం కల్గుతుందన్నారు.

'ఆడుదాం-ఆంధ్రా'పై విచారణ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పేరు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈవెంట్‌లో దాదాపు 100 కోట్లుకు పైగా అవినీతి అక్రమాలు జరిగాయని దీనిపై తాము సిపిఐడికి ఇర్యాదు చేస్తే ఆ శాఖ మాజీ మంత్రి ఆర్‌కె.రోజా వెటకారంగా మాట్లాడటం జరిగిందని చంద్రబాబు ప్రభుత్వం తక్షణం విచారణ చేయిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని అలా చేయకపోతే తామే తమ దగ్గర ఉన్న ఆధారాలతో కోర్టుకు వెళ్తామని కబడ్డీ క్రీడాకారుడు,ఏ.పీ. అట్యా -పాట్యా అసోసియేషన్ సి.ఈ.ఓ.రంభ ప్రసాద్ తెలిపారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పేరుతో నాసి రకం పరికరాలు కొనుగోలు చేసి కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. గతంలో చంద్రబాబు హయం లో నాణ్యత కలిగిన క్రీడా సామగ్రి కొనుగోలు చేశారని దాంతో ఎంతోమంది క్రీడల్లో రాణించి తమ నైపుణ్యం చాటుకోవటంతట ఆటు పతకాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొంది ఉన్నారన్నారు. అందుకు భిన్నంగా వైసిపి ప్రభుత్వం ప్రచారం పిచ్చితో ప్రతి వస్తువుపై జగన్ బొమ్మలు వేసి రాష్ట్రం పరువు తీసారన్నారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రికెట్ బ్యాట్‌పై ఎంతో గుర్తింపు ఉన్నవారి పేరుతో వేశారని అయితే ఒక్క బాల్ కొట్టగానే సగానికి విరిగిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. అలాగే వైకాపా హయాంలో ఇంజనీరింగ్, మెడికల్ సీట్ల స్పోర్ట్స్ కోటా లో జరిగిన అవకతవకలపై కుడా పూర్తి స్థాయిలో విచారణ జరగాలన్నారు. అసలు స్పాన్సర్ లు ద్వారా వచ్చిన నిధులెన్ని,స్పోర్ట్స్ అథారిటీ ద్వారా ఎంత అనేది కుడా బయట పెట్టాలని డిమాండ్ చేశారు.స్పోర్ట్స్ అథారిటీ ద్వారా మీరిచ్చిన వివరాలపై సిబిడి విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు.సిబిడి విచారణ నుంచి మీరు తప్పించుకోలేరు అన్నారు.ఈ సమావేశంలో కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.వి.నాంచారయ్య,మోడ్రన్ కోకో స్టేట్ ప్రెసిడెంట్ రుత్తల అప్పలస్వామి, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి టీడీపీ నేతల శుభాకాంక్షలు

విశాలాంధ్ర - అద్దంకి : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా శనివారం సచివాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించిన గొట్టిపాటి రవికుమార్‌ను అద్దంకి తెలుగుదేశం పార్టీ నాయకులు సందిరెడ్డి రమేష్, 19వ వార్డు కౌన్సిలర్ ఏజెంట్ల నాగరాజు. ఇక్కుర్తి కొండలు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని లక్ష్మీ శ్రీనివాసరావు. గార్లపాటి శ్రీనివాసరావు. ధర్మవరపు నాగేశ్వరరావు తదితరులు కలిసి మంత్రి రవికుమార్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వేణుగోపాల స్వామి రథోత్సవం

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో పెంచేసి ఉన్న రుక్మిని సత్యభామ సమేత వేణుగోపాల స్వామి రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి కళ్యాణ మహొత్సవం నిర్వహించి, అనంతరం గ్రామంలో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి విశేష అర్చనలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి కళ్యాణం సందర్భంగా వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. దేవాదాయ శాఖ ఈవో ఎం.నాగయ్య కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చింతపల్లి పాడులో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి పాల పొంగళ్లను పెట్టి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు కోలాట కార్యక్రమం నిర్వహించారు.

అసాంఘిక శక్తులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : బహిరంగంగా మద్యం సేవించే వారిపై, గంజాయి సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్‌పీ నాయకులు జగన్ మోహన్ రావు, కాటి మార్క్ అన్నారు. హత్యాచార దుర్ఘటనలో అసువులు బాసిన మండలంలోని ఈపురుపాలెం పంచాయితీ సీతారామ పేట నివాసి పి.సుచరిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలను సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. బాధిత కుటుంబానికి బహుజన సమాజ్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షిస్తాం: ఎమ్మెల్యే

◆ రామాపురం బీచ్‌లో యువకుల మృతిపై దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - మార్టూరు : బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం ఈపూరుపాలెంలో సుచరిత అనే యువతి దారుణ హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. జరిగిన సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి హోం మంత్రి వంగలపూడి అనిత ద్వారా 10 లక్షల రూపాయలు సాయాన్ని అందజేశారని అన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. 48 గంటల్లో ఈ ఘటనకు కారకులైన వారిని పట్టుకునేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇటువంటి అమానుష సంఘటన జరగటం విచారకరమన్నారు. జిల్లాలోని రామాపురం బీచ్‌లో ముగ్గురు యువకులు మృత్యువాత పడటం మరో దురదృష్టకరమైన సంఘటనగా ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ఏలూరి సాంబశివరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఇటువంటి సంఘటనలు జరగకుండా పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు చేపట్టడంతో పాటు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏలూరి సాంబశివరావు అన్నారు. జిల్లాలో ఈరోజు జరిగిన రెండు విషాదకర సంఘటనలు తనను కలచి వేశాయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.

వందో రోజుకు అన్నదానం

విశాలాంధ్ర - వేటపాలెం : రోటరీ క్లబ్ ఆధ్వ ర్యంలో 23-24 సంవత్సరంలోజాంధ్రపేట లోని గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో చేస్తున్న అన్నదాన కార్యక్రమం శనివారం నాటికి 100 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ వేటపాలెం రోటరీ క్లబ్ చేస్తున్న అన్నదాన కార్యక్రమం అభినందనీయమని అన్నారు. అన్నార్తులను ఆదుకోవడం అందరి బాధ్యత అని వివరిం చారు. వేటపాలెం రోటరీ క్లబ్ వారు సమిష్టి కృషితో ఎన్నో కార్యక్రమాలు చేశారని, ఈ సంవత్సరం చేసిన కార్యక్రమాలు ప్రజలకు ఎంతో చేరువయ్యా అని వివరిం చారు. పందిళ్ళపల్లి జెడ్ పి హెచ్ ఎస్ ఓల్డ్ స్టూడెంట్స్ సొసైటీ కార్యదర్శి రొండ దశరథ్ మాట్లాడుతూ వేట పాలెం రోటరీ క్లబ్ కు ఎంత గుర్తింపు తెచ్చిన అధ్యక్షుడు బట్ట మోహన్ రావు ను ప్రత్యేకంగా ప్రశంసించారు. 60 మంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ దంపతులను,రోటరీ సభ్యులను, విలేకరులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సతీమణి రాజేశ్వరి, క్లబ్ అధ్యక్షుడు బట్ట మోహన్ రావు, కార్యదర్శి ఏవి సురేష్ బాబు,క్లబ్ సభ్యులుకొత్త శ్రీనివాసరావు (వాసు), ఆత్మకూరు సుబ్బారావు, గుత్తి పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ పరిధిలో ఉమ్మడి తనిఖీలు

సముద్ర తీర ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికుల డిమాండ్

విశాలాంధ్ర - వేటపాలెం : బాపట్ల చీరాల రెవెన్యూ డివిజన్‌ల పరిధిలోని సముద్ర తీరంలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా సముద్రపు అలల రేఖ నుండి 200 మీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలను తొలగించి తీరప్రాంతాన్ని రక్షించుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామస్తులు, నాగార్జున రెడ్డి దాఖలు చేసిన ఫిర్యాదులపై శనివారం సముద్రతీరంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారుల ఉమ్మడి తనికీలు నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కాలుష్య నియంత్రణ మండలికి చెందిన ఈరోజు వేటపాలెం చీరాల మండలాల్లో సముద్ర తీరం పర్యటించారు. చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోని ఆక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సముద్ర తీరం వెంట నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అన్ని నిర్మాణ లకు సంబంధించి, యజమానులకు ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తిస్థాయి సంయుక్త బాపట్ల జిల్లా కలెక్టర్కు సమర్పిస్తామని తెలిపారు. పొట్టి సుబోయిపాలెం గ్రామస్తులు అధికారులతో మాట్లాడుతూ సీఎం అవుతూ దగ్గర జరిగిన ఆక్రమణలను అడ్డుకునే ప్రయత్నంలో యజమాని మాపై అక్రమ కేసులు పెట్టి వేదించారని అధికారులకు తెలిపారు. మరొక ఫిర్యాదుదారు నాయుడు నాగార్జున రెడ్డి మాట్లాడుతూ బాపట్ల జిల్లా లోని బాపట్ల చీరాల వేటపాలెం చిన్న గంజాం మండలాల్లో సిఆర్‌జెడ్ నిబ్బందులకు అనుగుణంగా 200 మీటర్లు 500 మీటర్లు మార్కింగ్ లైన్ ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

బాధిత కుటుంబానికి ఎంపీ పరామర్శ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం ఈపురు పాలెం పంచాయతీ సీతారామ పేటలో నివసించే పి సుచరితపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి, పాశవికంగా హత్య చేసిన ప్రదేశాన్ని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ సందర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యం చెప్పి అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాతాని ఉమామహేశ్వరరావు, గుద్దంటి చంద్రమౌళి, ఎస్ కె యాసిన్, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, మొహిద్దీన్, అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : సుచరిత అత్యాచార,హత్య కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేసి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ ఆర్మీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మార్పు దీనరాజు అన్నారు. సీతారామపేటలోని 21 సంవత్సరాలు వయస్సున్న బిసి యువతీ పీ సుచరితను దారుణంగా రేప్ చేసి హత్య చేసిన దుండగులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, అధికారులు బాధితులకు న్యాయం చెయ్యలేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీసుకువెళ్తామని అన్నారు.

బాధిత కుటుంబానికి కరణం పరామర్శ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం ఈపురుపాలెం పంచాయతీ సీతారామపేటకు చెందిన యువతి పౌజుల సుచరిత (21) పై అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన ప్రాంతాన్ని చీరాల నియోజక వర్గ మాజీ శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సుచరిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. చీరాల మండలం వాడరేవు గ్రామ నివాసి కొక్కిలిగడ్డ మస్తాన్ రోడ్డు ప్రమాద దుర్ఘటనలో మృతి చెందగా ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆసాది అంకాలరెడ్డి, బొడ్డు సుబ్బారావు, గవిని శ్రీనివాసరావు, బొనిగల జైసన్ బాబు, బిట్ర శ్రీనివాసరావు, దామర్ల శ్రీకృష్ణ, కావూరి రమణారెడ్డి, దివి జయరాం, ఎరిపల్లి రమణ, మండ గిరీష్, స్థానిక నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.